# లాంగ్ షాట్ – క్లోజ్ షాట్

ఎడమ చేతి మణికట్టుకి కాస్త దిగువ బ్లేడుతో కోశాను. సన్నటి గీతలా తెగీతెగనట్టుగా తెగింది. గీత ఎఱ్ఱబడింది గాని ఒక్క బొట్టు కూడా రక్తం కారలేదు.

ఈ బ్లేడుతో ఇప్పటికే కనీసం అరడజను సార్లు గడ్డం గీశాను. ఇవ్వాళ పొద్దున గోళ్లు కూడా తీశాను... ఇంకేం తెగుతుంది? ఈ సారి మరి కాస్త గట్టిగా అక్కడే కోశాను.. ఈసారి గీత మరింత స్పష్టంగా ఏర్పడింది... గీత పొడుగునా చిరుచిరు బిందువులుగా రక్తం చెమర్చింది... ఫర్వాలేదు... ఒంట్లో ఇంకా రక్తం వుంది... కోసిన వెంటనే ఏమీ అనిపించలేదు గాని కాస్సేపటికి కోసినచోట చిమచిమలాడుతోంది... కొద్దిగా మండుతోంది...

ఈ చిమచిమలూ చిరుమంటలూ నాకేమీ బాధగా లేవు. పైగా కాస్సేపటికి అదోరకం హాయి కూడా కలుగుతోంది. మనసంతా మొద్దు బారిపోయినట్టుగా, ఏ విధమైన చలనమూ సంచలనమూ లేకుండా, దట్టమైన పొగమంచు కళ్లముందు కమ్మి, అంతా మసకబారిపోయినట్టుగా వున్నప్పుడు – శారీరకంగానైనా ఏదో ఒక చైతన్యం కావాలి.. వేడి కావాలి మంట మండాలి... జీవితంలో ఏ విధమైన సుఖమూ, శాంతీ లేకుండా, ఏ ఆనందమూ ఎరగకుండా, కనుచూపుమేరలో ఏ కాంతీ కనబడకుండా, ఏం చెయ్యాలో తోచకుండా వున్నప్పుడు నాకు తోచిన ఉపాయం ఇదే... తన్ను తాను హింసించుకుని ఆ బాధ నుంచి ఆనందపు అనుభూతిని అందుకునే ప్రయత్నం చేసే వాళ్లని సైకాలజిస్టులూ, సైకియాట్రిస్టులూ మానసిక రోగులుగా పరిగణించవచ్చు... అటువంటి రోగం నాకేమీ లేదు.

కోసిన చోట ముంజెయ్యి ఇంకా మండుతూనే వుంది... పైకి వుబికిన రక్తం ఒకసారి తుడిచాను... మరికాస్సేపటికి మరికొంత రక్తం చెమర్చింది.... చర్మపు పై పొర మటుకే కాస్త తెగింది... ఎన్ని మార్లు పైకి వుబికినా అంతా కలిపి నాలుగైదు బొట్లు కంటే రక్తం స్రవించలేదు... నెత్తుటిగీత వెంట చిరుమంటమాత్రం అలాగే వుంది... ఒకటి రెండు రోజులైనా ఈ గాయం మానకుండా వుంటే బావుండును.

మరో రెండు గంటల్లో స్టూడియోకి బయల్దేరాలి.. మూడురోజుల్నించి దొరక్కుండా వున్న ఆ పారపళ్ల డైరెక్టర్ గాణ్ణి ఇవ్వాళ ఎలాగైనా పట్టుకోవాలి.

★★★

స్టూడియో గేటు ముందు కాపలావాడు అడ్డగించాడు. ఇంతకుముందు ఇదే స్టూడియోలోకి చాలాసార్లు వెళ్లాను. ఎన్నిసార్లు చూసినా కొత్తే వీడికి... వచ్చిన పనేమిటో చెప్పాను.... వీల్లేదన్నాడు... వీణ్ణి బతిమాలీ, బామ్మాలీ, లేదా ఎంతో కొంత చేతిలో పెట్టీ మంచి చేసుకోవాలి... అలా చెయ్యటం నాకిష్టం లేదు. పారపళ్ల డైరెక్టర్‌గాడి పేరు చెప్పాను... ''ఇవ్వాళ ఈ టైమ్ కొచ్చి కలవమన్నారు... ఇవ్వాళ ఆయన్ని కలవకుండా వెళ్లేది లేదు.... ఆ పైన నీ ఇష్టం'' అన్నాను. అరగంటసేపు అక్కడే నిలబెట్టి ఆ తర్వాత వదిలాడు.

పారపళ్ల డైరెక్టర్‌కి బాన పొట్ట కూడా వుంది... తెగబలిసిన సీమపందిలా వుంటాడు... అయిదు నిమిషాలు అదేపనిగా వాడి మొహం చూస్తే వాంతి వస్తుంది. ఆకారమే కాదు... వాడి నవ్వూ, మాటలూ, వాడి సినిమాలూ అన్నీ అసహ్యంగానే వుంటాయి... అయితేనేం ఇవ్వాళ ఇండస్ట్రీలో వున్న అయిదారుగురు టాప్ డైరెక్టర్లలో వాడొకడు. అందుకే ప్రొడ్యూసర్లూ, బయ్యర్లూ, ఫైనాన్షియర్లూ, తారలూ, తారామణులూ వాడికి కాకా పడ్తూ వుంటారు... అవసరమైతే కాళ్లు పడ్తూ వుంటారు.

ఫ్లోర్ బయట రెండు గంటలూ, లోపల మరో రెండు గంటలూ పడిగాపులు పడ్డాక పారపళ్ల డైరెక్టర్‌తో రెండు నిమిషాలు మాట్లాడే అవకాశం దొరికింది... హీరో రిక్షావాడు.... హీరోయిన్ ఆ వాడలో ఇంటింటికీ తిరిగి కూరగాయలమ్ముతూ వుంటుంది... రోజంతా ఎండలో తిరిగి అలసిపోయిన హీరోయిన్ తన పాకలోకి వెళ్లి, కూరగాయల బుట్ట ఒక మూల పడేసి, కుక్కి మంచమ్మీద మూలుగుతూ పడివున్న ముసలి తల్లితో మూడు పేజీల డైలాగు చెప్పి, చీరా, రవికా అక్కడే విడిచిపడేసి, స్నానానికి వెళ్తుంది... తడికలతో కట్టిన స్నానాలగదిలో స్నానం చేస్తూ ఊహాలోకం లోకి వెళ్లిపోతుంది... స్నానాల గదిలోనూ ఆ తర్వాత వచ్చే వూహాలోకపు జలపాతం సీన్లోనూ కూడా హీరోయిన్ బట్టలు దాదాపు అన్నీ విప్పించి, ప్రేక్షకలోకానికి కనువిందు చెయ్యాలని ప్రొడ్యూసరూ, డైరెక్టరూ నిర్ణయించుకున్నారు.. హీరోయిన్ బట్టలు విప్పడానికేమీ అభ్యంతరం చెప్పలేదు గాని, స్నానాల గదిలో తొట్టినిండా మినరల్ వాటర్ పోస్తే గాని స్నానం చెయ్యనని పేచీ పెట్టింది... ఆ తొట్టి నిండా

పొయ్యాలంటే కనీసం యాభై సీసాల మినరల్ వాటర్ కావాలి... స్టూడియో కాంటీన్లో పది పన్నెండు సీసాల కన్నాలేవు... సీసాలొచ్చాక కబురెట్టమని హీరోయిన్ తన మేకప్ రూమ్‌లో కెళ్లిపోయింది... మినరల్ వాటర్ కోసం ప్రొడక్షన్ మేనేజర్ కార్లో బయటికి పరుగెత్తాడు... షూటింగ్ ఆగిపోయింది...

ఈ సీన్లు ఇవ్వాళ పూర్తి కాకపోతే మళ్లీ నెలరోజుల్దాకా హీరోయిన్ కాల్షీట్లు లేవు... ప్రొడ్యూసర్ కాలుగాలిన పిల్లిలా అటూ యిటూ తిరుగుతున్నాడు... డైరెక్టర్ నిప్పు తొక్కిన కోతిలా గంతులేస్తూ, తన అసిస్టెంట్ల మీదా, ప్రొడక్షన్ వాళ్ల మీదా అరుస్తున్నాడు...

డైరెక్టర్ కాస్త చల్లబడ్డాక మెల్లగా దగ్గర కెళ్లి నమస్కారం చేసి, లోగడ వాణ్ణి కలిసిన సంగతీ, నెలరోజుల తర్వాత మళ్లీ రమ్మన్న సంగతీ గుర్తు చేశాను – వీలైనంత వినయం నటిస్తూ.

పారపళ్ల డైరెక్టర్ నన్ను ఎగాదిగా చూశాడు... ఆపాదమస్తకం పరీక్షగా చూశాడు... పరీక్షలో నూటికి పది మార్కులు కూడా రాని వాణ్ణి చూసినట్టు హేళనగా చూశాడు... పారపళ్లు బయటపెట్టి వెక్కిరింపుగా నవ్వాడు... ''వేషాల్లేవు... ఉన్నా, నీకు పనికొచ్చే వేషాల్లేవు... నీకు పనికొచ్చే వేషం వున్నప్పుడు నేనే కబురు చేస్తాలే... వెళ్లిరా...!'' అన్నాడు.

వాడి మాటల్లో వున్న వ్యంగ్యం నాకర్థమైంది. ... ఇదివరలో ఒకసారి వాడు నన్నోవేషం వెయ్యమన్నాడు... తెరమీద ఒక్క నిమిషం కూడా కనిపించని, ఒక్క డైలాగ్ కూడా లేని వేషం అది... నేను వెయ్యనన్నాను... అటువంటి ఎక్స్‌ట్రా వేషాలు వెయ్యనన్నాను... చిన్నదైనా సరే, కాస్తోకూస్తో ఇంపార్టెన్స్ వున్న వేషమైతేనే వస్తానన్నాను... నాకు తగిన వేషమైతేనే వేస్తానన్నాను... అదీ వాడి మంట... ఆ విషయం ఇంకా గుర్తెట్టుకుని ఇప్పుడు దెబ్బతీస్తున్నాడు... ఇప్పుడు ఏ వేషమైనా ఎంత చిన్న వేషమైనా వేస్తానని వాడితో చెప్పలేకపోయాను... ''మళ్లీ కలుస్తాను సార్...'' అని, మరోమారు దొంగ నమస్కారం పెట్టి అక్కణ్ణించి వచ్చేశాను.

★★★

చేతిమీద నిన్న బ్లేడుతో కోసిన చోట అప్పుడే ఎండిపోయింది... గాయమూ లేదు, మంటా లేదు... మొండి బ్లేడుతో ఈ రకంగా చేతుల మీదా, కాళ్ల మీదా గీతలు

పెట్టుకుని ఏమీ ప్రయోజనం లేదు. మంచి పదునైన కత్తితో సర్రున కోసుకోవాలి... ముంజేతి మీద కాదు... గొంతుమీద... ఒక్క కోతతో పీక తెగిపోవాలి... ఆ పని చెయ్యటానికింకా కొంత టైముందనుకుంటాను...

మొండి బ్లేడు చెత్తబుట్టలోకి విసిరేశాను... రేపు గడ్డం గీసుకోడానికి బ్లేడు లేదు... కొత్త బ్లేళ్లు కాదు... బ్లేడు... ఒక్కటి కొంటే చాలు... ఒక్కటి కొనగలిగితే చాలు ... బ్లేడు కొనడానికి డబ్బులున్నాయి... రేప్పొద్దున టిఫిన్ తినడానికీ, కాఫీ తాగడానికీ, ఓ అర పాకెట్టు సిగరెట్లు కొనుక్కోవడానికీ కూడా డబ్బులున్నాయి... ఆ పైన మరింక లేవు... మళ్లీ అప్పు చెయ్యాలి... ఇంకా అప్పు ఎవడిస్తాడు? కొత్త అప్పు కోసం ... కొత్తగా అప్పిచ్చేవాడి కోసం... కాదు, అప్పిచ్చే కొత్త వాడి కోసం రేపు వేట సాగించాలి... వేషాల కోసం వేట కొనసాగించాలి ముందు. ఇదే ముఖ్యం... ఒకటి రెండు రోజులు అన్నం లేకపోయినా చావను... పస్తులుండటం అలవాటైపోయింది... రేపొద్దున కొత్త బ్లేడుతో నున్నగా గడ్డం గీక్కొని, మడత విప్పని చొక్కా ఇంకోటుంది... ఆ చొక్కా తొడుక్కుని వేషాల వేటకి బయల్దేరాలి... రేపు చిన్నారావు గాణ్ణి ఎలాగైనా పట్టుకోవాలి...

★★★

చిన్నారావు చిన్న ఏనుగు సైజులో, పెద్ద దున్నపోతు పరిమాణంలో నల్లగా నిగనిగలాడుతూ వుంటాడు... వాణ్ణి కొంతమంది చాటున దున్నారావు అని కూడా అంటారు... వాడిలో మనిషి లక్షణాలకంటే జంతులక్షణాలే ఎక్కువ... చిన్నారావు పెద్ద ప్రొడ్యూసరు... సినిమా రంగపు పెద్దల్లో ఒకడు... ఆ రంగానికీ, వాడికీ పెద్ద అనుబంధమే వుంది... బ్లాక్ అండ్ వైట్ సినిమాల రోజుల్లో – సినిమా హాళ్లలో బ్లాక్‌లో టికెట్లమ్మేవాడు... ఆ తర్వాత సినిమా కంపెనీల్లో కాఫీలూ, టీలూ అందించే బోయ్‌గా, మందు సీసాలతోపాటు మగువల్ని కూడా సరఫరా చేసే బ్రోకర్‌గా, జూనియర్ ఆర్టిస్ట్ సప్లయర్‌గా, ప్రొడక్షన్ మేనేజర్‌గా వివిధ శాఖల్లో అపారమైన అనుభవం గడించి, ఒక శుభోదయాన ప్రొడ్యూసరైపోయాడు. వయసు మీరి, శరీరం అడ్డంగా పెరిగి, వేషాలు సన్నగిల్లిన ఒక మాజీ తారామణికి మొగుడిగా కూడా కొన్నాళ్లు పని చేశాడు... పెళ్లీ గిళ్లీ ఏమీ లేదు... ఆవిడే వాణ్ణి కొన్నాళ్లు వుంచుకుందనీ, ఆ కొన్నేళ్లలోనే ఆవిడ ఆస్తి వీడు చాలా మింగేసి, ఆ వెనక ప్రొడ్యూసరై పోయాడనీ కూడా చాలామంది అనుకుంటారు... ఏమైతేనేం, చిన్నారావు ఇవ్వాళ పెద్ద ప్రొడ్యూసర్...

చిన్నారావు ప్రస్తుతం ఒక పెద్ద సినిమా తీస్తున్నాడు... పద్ధెనిమిది కోట్ల బడ్జెట్ ... మల్టీ స్టారర్... ముగ్గురు హీరోలు ... నలుగురు హీరోయిన్లు... అయిదుగురు విలన్లు... డైరెక్టర్ ఒకడేగాని కో డైరెక్టర్లు ఇద్దరున్నారు. ఏకకాలంలో విడివిడిగా రెండు సెట్ల మీద షూటింగ్ జరుగుతోంది... చిన్నారావు ఏ సెట్లో వున్నాడో తెలుసుకుని అక్కడికే వెళ్లాను... ఈ సినిమా మొదలెట్టక ముందే చిన్నారావుని కలిశాను... చిన్న వేషాల గురించి ఇంకా ఏమీ అనుకోలేదు... సినిమా మొదలెట్టాక కనబడమన్నాడు... సినిమా ప్రారంభమయ్యాక వాణ్ణి కలవడానికి రెండు మూడు మార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అందుకే, ఇవ్వాళ ఎలాగైనా పట్టుకుని ఏదో ఒక వేషం సంపాదించాలి... ఇంకా నెల రోజుల షూటింగ్ వుందంటున్నారు... చాలా వేషాలున్నాయంటున్నారు...

చిన్నారావు ఇప్పుడు తీస్తున్న ఈ భారీ చిత్రం సాంఘికంగా ప్రారంభమై, మధ్యలో జానపదంగా మారి, చివరికి పౌరాణికంగా పరిణమిస్తుందట! అసలు ఎప్పుడు ఏ రకంగా మారుతుందో ఎవరూ వూహించలేరట... ఇవ్వాల్టి షూటింగ్‌లో ఒక హీరో, ఇద్దరు హీరోయిన్లూ పాల్గొంటున్నారు. ముగ్గురిలో ఎవరికీ తెలుగు రాదు... డైరెక్టర్‌కి తెలుగు తప్ప మరే భాషా రాదు... హీరో సి.బి.ఐ. ఏజెంటు... ఒక హీరోయిన్ రాకుమారి... మరో హీరోయిన్ దేవకన్య! రాకుమారి, దేవకన్య ఇద్దరూ సి.బి.ఐ ఆఫీసర్ని గాఢంగా ప్రేమిస్తున్నారు... అతగాడు కూడా ఆ ఇద్దర్నీ మోహిస్తూ, ఏకకాలంలో ఇద్దరితోనూ పాటపాడుతున్నాడు. పాట మధ్యలో వర్షం వస్తుంది... ఎంత వాన కురిసినా, సి.బి.ఐ. ఏజెంటూ, రాకుమారీ తడుస్తారు గాని, దేవకన్య తడవదు! దేవకన్య కౌగిట్లో వున్నంతసేపూ హీరో కూడా తడవడు! ఇటువంటి అద్భుత సన్నివేశాలన్నీ ఇవ్వాళ చిత్రీకరిస్తున్నారు. పాటలో ఒక చరణం స్విట్జర్లండ్‌లోనూ, ఒక చరణం సింగపూర్‌లోనూ, మరో చరణం మారిషస్‌లోనూ చిత్రీకరిస్తారట... పల్లవి కాక ఒక్క చరణం మటుకే స్టూడియోలో తీస్తున్నారు.

షూటింగ్ నత్తనడక నడుస్తోంది... ఎంతసేపటికీ పల్లవి పల్లవించటం లేదు, చరణం చలించటం లేదు.

ఆకలిగా వుంది... నీరసంగా వుంది... విసుగ్గా వుంది... స్టూడియోలోపల ఉక్కగా వుంది... బయట ఎండగా వుంది... దూరంగా ఒక చెట్టు కింద చతికిలబడి సిగరెట్ వెలిగించాను.. ఖాళీ కడుపుమీద సిగరెట్ ఏమీ రుచించటం లేదు... సగం పీల్చి అవతల పారేశాను... లంచ్ బ్రేక్‌లో చిన్నారావుని కలవలేకపోయాను. రాకుమారి వేషం వేస్తున్న కన్నడకుమారి, తెలుగులో పెద్ద సినిమాల్లో నటించి పెద్ద

స్టార్ కావాలని ఆశపడ్తోంది. అందుకని చిన్నారావులాంటి పెద్ద ప్రొడ్యూసర్లని మంచి చేసుకునే మర్యాదల్లో భాగంగా – కన్నడ వంటకాల రుచి చూపిస్తాను రమ్మని లంచ్‌కి తన రూమ్‌లోకి లాక్కుపోయింది.

అప్పుడే నాలుగవుతోంది... పొద్దున ఎనిమిదింటికి రెండు ఇడ్లీలు, ఒక వడ తిని కాఫీ తాగాను... అంతే... ఆ తర్వాత ఏమీ లేదు... ఆకలి మండుతోంది... ఎండవేడి ఇంకా తగ్గలేదు... దేవకన్య వేషం వేస్తున్న హిందీ సుందరి ఈవెనింగ్ ఫ్లయిట్‌లో బొంబాయి వెళ్లాలట... అందువల్ల ఇవ్వాళ షూటింగ్ త్వరగానే ముగుస్తుందని నాకు కొద్దిగా పరిచయమున్న అసిస్టెంట్ డైరెక్టర్ చెప్పాడు... షూటింగ్ పూర్తయి వెళ్లే లోగా చిన్నారావుని ఎలాగైనా కలవాలి...

★★★

అర్ధరాత్రి దాటింది... నిద్రపట్టడం లేదు. ... కడుపు మండుతోంది... కళ్లు మండుతున్నాయి... నిన్న ప్రొద్దుట్నించీ తిండి లేదు... నిన్న మూడుసార్లూ, ఇవ్వాళ రెండు సార్లూ కాఫీ నీళ్లూ, టీ నీళ్లూ తాగాను... అప్పు దొరకలేదు... చిన్నారావు గాడి కోసం పడిగాపులు పడ్తూ నిన్నంతా స్టూడియోలోనే వుండిపోయాను... అప్పుకోసం తిరిగే వ్యవధి లేకపోయింది... ఇవ్వాళ ఇద్దరు ముగ్గుర్ని కలిశాను... ఇద్దరు మొండి చెయ్యి చూపించారు... మూడో వాడు ఆరురూపాయలిచ్చాడు... తీసుకోవద్దనుకున్నానుగాని టీ నీళ్లకైనా పనికొస్తాయని కక్కుర్తిపడ్డాను... నా పరిస్థితి ఇంతలోనే ఇంత హీనంగా మారిపోతుందని అనుకోలేదు.

అప్పుడే నాలుగేళ్లయింది ఈ మహానగరానికి కొచ్చి... ఈ మాయాలోకంలో పడి... కాలేజీలోనూ, ఆ తర్వాతా పట్టుకున్న నాటకాల పిచ్చి సినిమా పిచ్చిగా మారటానికి ఎంతో కాలం పట్టలేదు... నాకున్న విగ్రహమూ, నాకున్న నటనాశక్తీ ఇవ్వాల్టి సినిమా హీరోలెవరికీ లేవనీ, నేను ఇవ్వాళ సినిమాల్లో చేరితే రేపటికల్లా పెద్ద హీరోనైపోతాననీ, నాతో చాలామంది ఎంతో నమ్మకంగా చెప్పారు. ఆ మాటలన్నీ పూర్తిగా నమ్మకపోయినా, హీరో కాకపోతే కనీసం సైడ్ హీరోనన్నా కాకపోతానా అన్న ఆశతో, ఉన్న ఊరూ, చేస్తున్న ఉద్యోగమూ విడిచిపెట్టి వచ్చాను... నా ఆశలు అణగారి పోవడానికీ, నానమ్మకాలు వమ్ముకావటానికీ ఎంతో కాలం పట్టలేదు... ఈ నాలుగేళ్లలోనూ పట్టుమని పదివేషాలు కూడా దొరకలేదు... అవి కూడా అంతంత మాత్రపు వేషాలే... ఆ మాత్రపు వేషాలు కూడా ఇప్పుడు దొరకటం లేదు...

మాటా, పలుకూ లేని మరీ చిన్న వేషాలు వెయ్యటానికి మన సొప్పటం లేదు... జూనియర్ ఆర్టిస్ట్ అన్న పేరుతో ఎక్స్‌ట్రా వేషాలు వెయ్యటానికి అహం అడ్డుపడ్తోంది.

నాలాంటి ఎంతోమందికి ఒక రంగుల కలగా, ఒక దివ్యలోకంలా కనిపించి, ఆశలు రేపి, ఆకర్షించే సినిమా రంగపు నిజస్వరూపం ఈ నాలుగేళ్లలో నాకు బాగా అర్థమైపోయింది. ఇక్కడ నటీనటులు మాత్రమే కాదు– ప్రతి ఒక్కరూ నటిస్తారు... ప్రతి ఒక్కరూ మారువేషాలు ధరిస్తారు... ఇక్కడ ప్రతిభకి ప్రమాణం వేరు... అర్హతకి అర్థం వేరు... నీతికి నిర్వచనం వేరు ... ఇక్కడ అవకాశాలు దక్కించుకునే దారులు వేరు... విజయాలు సాధించే విలువలు వేరు.

ఈ దొంగ వేషాలు వెయ్యలేక, ఈ అడ్డదారులు తొక్కలేక, ఈ వింత విలువలు జీర్ణించుకోలేక నేను నలిగిపోయాను... నాశనమై పోయాను... నా మనసు చితికిపోయింది... నాకున్న కొద్దిపాటి ఆస్తీ కరిగిపోయింది... ఇప్పుడింక ముందుకీ నడవలేను... వెనక్కీ వెళ్లలేను...'

నిన్నటి రోజున చిన్నారావుగాడు చేసిన అవమానం తలుచుకుంటే గుండెలు మండుతున్నాయి... వేషం ఇమ్మని అడిగినందుగ్గాను నలుగురి ముందూ పట్టుకుని నానామాటలూ అన్నాడు... పురుగుని విదిలించినట్టు విదిలించాడు... స్టూడియో నుంచి బయటికి తరిమినంత పనిచేశాడు... నేనేమీ అనలేకపోయాను... మారు మాట్లాడలేకపోయాను... వాడి చీవాట్లూ, తిట్లూ అన్నీ మౌనంగా భరించి, తలవంచుకుని బయటి కొచ్చేశాను...

ప్రతిరోజూ ప్రతినిమిషమూ మెల్లమెల్లగా నేను మరణిస్తున్నాను... ఇప్పటికే సగం చచ్చిపోయాను... అందుకే నిన్న చిన్నారావుగాడు అంతగా అవమానించినా ఏమీ అన్లేకపోయాను... ఏమీ చెయ్యలేకపోయాను.

★★★

నాకు వేషం దొరికింది... నాలుగు రోజులు వరసగా పస్తులుండేసరికి నా పని అయిపోయింది... మరో నాలుగు రోజులు ఇలాగే వుంటే చచ్చిపోతానేమోనని భయమేసింది...మనసనేది ఎలాగూ క్రమక్రమంగా మరణిస్తూనే వుంది... ఈ శరీరమైనా బ్రతకాలి... ఎలాగైనా బ్రతకాలి... అందుకే ఈ వేషం వెయ్యడానికొప్పుకున్నాను... శవంగా మారకుండా వుండేందుగ్గాను శవంగా నటించడానికి అంగీకరించాను.

★★★

ఈ సినిమాలో హీరోయిన్ మహాపతివ్రత. పరమభక్తురాలు... పొద్దున్నే లేవగానే పతిదేవుడికి పాదపూజ చేస్తుంది... ఆ తర్వాత అందరు దేవుళ్లకీ, దేవతలకీ పూజలు చేస్తుంది. నూకాలమ్మకి మాత్రం ప్రత్యేకమైన పూజలు చేస్తుంది... నూకాలమ్మ ఆమె ఇష్టదేవత... నూకాలమ్మకి కూడా ఆమె అంటే ప్రత్యేకమైన ఇష్టమున్నట్లు ప్రతిరీలుకీ ఒక మారు రుజువౌతూ ఉంటుంది... మహాపతివ్రత అయిన హీరోయిన్‌కి పాపం, ప్రతి సీన్లోనూ ఏదో ఒక కష్టం ఎదురౌతూ వుంటుంది... పరమభక్తురాలూ, నూకాలమ్మ ప్రత్యేకభక్తురాలూ అయిన కథానాయిక నూకాలమ్మ చలవతో ఆ కష్టాలన్నిటినీ అవలీలగా అధిగమిస్తూ వుంటుంది... ఏ మాత్రం కష్టం వచ్చినా, "నూకాలమ్మా ... నువ్వే నన్ను సాకాలమ్మా..." అంటూ ఎనభై వాద్యాల సాయంతో ఎలుగెత్తి పాడుతూ వుంటుంది... మొత్తం పది నిమిషాల పొడవుండే ఈ పాట, సినిమాలో పదిహేను సార్లు వినిపిస్తుందట... ఈ సినిమాలోని ప్రత్యేక ఆకర్షణల్లో అదీ ఒకటి... సినిమా పేరే 'నూకాలమ్మ మహాత్మ్యం' అని పెడదామనుకున్నారు గాని, మరీ పాత పద్ధతిలో వుంటుందేమోనని 'అమ్మని మించిన అమ్మ నూకాలమ్మ' అని పెట్టారు. నూకాలమ్మ మాయలూ, మహిమలూ అపూర్వంగా, అద్భుతంగా చూపించడం కోసం కంప్యూటర్ల సాయంతో సృష్టించే స్పెషల్ ఎఫెక్ట్స్‌కే కోటిన్నర రూపాయలు ఖర్చు పెడ్తున్నారట...!

సినిమా చివరి దశలో హీరోయిన్ భర్త కారు యాక్సిడెంట్లో చనిపోతాడు... భర్త శవం మీద పడి బావురుమని ఏడుస్తుంది హీరోయిన్... పోలీసులు శవాన్ని పోస్ట్‌మార్టమ్ చేయిస్తామంటే ఒప్పుకోదు... బంధువులు తగలెడ్తామంటే అందుకూ అంగీకరించదు... అసలెవర్నీ శవాన్ని ముట్టుకోనివ్వదు... నూకాలమ్మ గుడి గుమ్మానికి అడ్డంగా శవాన్ని పడుకోబెట్టి, తన భర్తను బతికించుకుంటాననీ, ఆయన్ని చంపిన ప్రతి ఒక్కరి మీదా ప్రతీకారం తీర్చుకుంటాననీ ప్రతిజ్ఞ చేస్తుంది...

...ఏకధాటిగా మూడు రాత్రులూ, మూడు పగళ్లూ దిక్కులు పిక్కటిల్లేట్టుగా పాట పాడి, భూమి అదిరేట్టుగా డాన్స్ చేసి నూకాలమ్మని ప్రసన్నం చేసుకుంటుంది; ప్రత్యక్షం చేసుకుంటుంది... నూకాలమ్మ ఆమె భర్తని బతికించటమే కాక, ముగ్గురు విలన్లనీ మూడు రూపాల్లో వెళ్లి సంహరిస్తుంది...!

ఇది జానపదచిత్రం కాదు... పౌరాణికం కానే కాదు... నూకాలమ్మ మహిమల్ని మానవాళికి చాటిచెప్పటం కోసం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి నిర్మిస్తున్న మహోజ్జ్వల సందేశాత్మక సాంఘికచిత్రమట!

ఈ సినిమాలో హీరోయిన్ మొగుడి శవంగా లాంగ్ షాట్లన్నిటిలోనూ నేనే నటిస్తున్నాను... క్లోజ్ షాట్లలో మాత్రం హీరోగారి మొహం అంగుళం మందాన మేకప్‌తో అందంగా కనబడుతుంది... మేకప్ లేకపోతే ఆ హీరోది నిజంగా ప్రేతకళే... వేషాలూ, మేకప్పులూ తీసేస్తే ఇక్కడ చాలా శవాలు బయటపడ్తాయి!

O

*('రచన' జన్మదిన ప్రత్యేక సంచిక-ఫిబ్రవరి - 1999)*